క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



జె. గౌతమ్ లోకేశ్ విద్యాసాగర్ జె.వీరన్న

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ గిరిజన గురుకుల బాలుర విద్యార్థులు మంగళవారం వెలువడిన జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ సాధించినట్లు బుధవారం ప్రిన్సిపాల్ మధు తెలిపారు. 27 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17 మంది అర్హత సాధించినట్లు చెప్పారు. జె.గౌతమ్ (92.2), బి.లోకేశ్ (70.04), బి.విద్యాసాగర్ (65.70), జె.వీరన్న (61.49), ఎం.అశోక్ (60.8), ఏ.మహేశ్ (60.07), జె.రాజేశ్ (60.07) శాతం మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు చెప్పారు. వీరిని ప్రిన్సిపాల్ మధు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

గజ్వేల్ ఏసీపీగా బాలాజీ బాధ్యతలు



సీపీ అనురాధకు పూల మొక్కను అందజేస్తున్న బాలాజీ

సిద్దిపేటకమాన్/గజ్వేల్‌రూరల్: గజ్వేల్ డివిజన్ నూతన ఏసీపీగా బాలాజీ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఆస్థానంలో విధులు నిర్వహించిన రమేష్ బదిలీపై వెళ్లారు. ఇక్కడికి బాలాజీ వచ్చారు. పోలీస్ కమిషనర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం ప్రజ్ఞాపూర్‌లో బాలాజీ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించగా.. ఆయనకు ఏసీపీ రమేష్ పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కమిషనర్ రమేష్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న కల్యాణం రమేష్‌కుమార్

దుబ్బాకటౌన్: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చి దిద్దేందుకు శాయశక్తుల కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ కల్యాణం రమేష్ కుమార్ స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా బాన్స్‌వాడ కమిషనర్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం సాక్షితో ముచ్చటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, పాలక మండలి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి పాటు పడతానన్నారు. ముఖ్యంగా పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తారన్నారు. ప్రజలు, వ్యాపారులు పన్నులు సక్రమంగా చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రజలు ఏవైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ప్రసన్న

సిద్దిపేటజోన్: మున్సిపల్ కమిషనర్‌గా ప్రసన్న కుమారి నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సంపత్ కుమార్ నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ప్రసన్న మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మూడు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

క్రీడా నైపుణ్యం పెంపొందేలా కృషి

జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మహాదేవ్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా నైపుణ్యం పెంపొందేలా కృషి చేస్తున్నామని జిల్లా సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలోని హైస్కూల్ ఆవరణలో స్నేహపూర్వక వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలన్నారు. పోటీల్లో బందారం విద్యార్థులు ప్రథమ స్థానం, దుద్దెడ విద్యార్థులు ద్వితీయ స్థానం పొందారన్నారు. విజేతలకు ఎస్ఎంసీ చైర్మన్ జగపతి ఎల్లం, నాయకుడు దోమల ఎల్లంలతో కలిసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అంపైర్‌గా ఎండీ అజారుద్దీన్, ఉపాధ్యాయుడు బాకి చంద్రబాను, నర్సారెడ్డి, రాంచంద్రం, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఎస్ఐగా జే కృష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆ స్థానంలో పని చేసిన నరేందర్‌రెడ్డి బదిలీపై గజ్వేల్ వెళ్లారు. కామారెడ్డి నుంచి జిల్లా మద్నూర్ నుంచి కృష్ణారెడ్డి బెజ్జంకి పీఎస్‌కు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైభవంగా వసంత పంచమి



షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులు



సరస్వతీ శిశుమందిర్‌లో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం

సిద్దిపేట జిల్లా కేంద్రంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం పట్టణంలోని అన్ని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో చిన్నారులకు అక్షర శ్రీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

కనుల పండువగా కల్యాణోత్సవం



మహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చనలో భక్తులు

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ అనంత మహాలక్ష్మి ఆలయంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అనంత మహాలక్ష్మి, పద్మనాభస్వామి కల్యాణోత్సవం వేదపండితుల మంత్రోశ్ఛరణలు, భక్తుల కరతాళ ధ్వనుల మధ్య కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా కుంకుమార్చన, పలు కార్యక్రమాలు నిర్వహించారు. నిరంతరం దైవ నామస్మరణలతోనే సుఖ సంతోషాలు కలుగుతాయని మాధవానంద సరస్వతీ స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

–దుబ్బాకటౌన్

భక్తుల కొంగు బంగారం మహంకాళమ్మ

నేటి నుంచి ఆలయ 7వ వార్షికోత్సవాలు



పట్టణంలోని మాత ఆలయం

దుబ్బాక టౌన్: భక్తుల కోర్కెలను తీర్చే మహిమ గల దేవతగా మహంకాళమ్మ ప్రసిద్ధి చెందింది. పట్టణంలోని చీకోడ్‌వెళ్లే బైపాస్ రోడ్డులో 7 ఏళ్ల క్రితం అమ్మ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారు. అన్ని హంగులతో నిర్మించడంతో అనతి కాలంలోనే భక్తుల తాకిడి ఎక్కువైంది. అప్పటి నుంచి అమ్మను కొలుచేందుకు రోజూ బారులు తీరుతుంటారు. 7వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

కాగా, కొన్ని యుగాలకు పూర్వం ఈ భూమిపై వందల సంవత్సరాల పాటు అత్యంత తీవ్రమైన కరువు ఏర్పడింది. వర్షాలు లేక, పంటలు పండక తినడానికి తిండిలేక, తాగేందుకు నీళ్ల లేక జనాలు హాహాకారాలు చేస్తున్నారు. జనం మహంకాళిని శరణు వేడుకోగా కరుణించి కాపాడిందని చరిత్ర చెబుతుంది. ఆషాఢ మాసంలో ఆకులు, పూవులు, పండ్లతో ఆభరణంగా అలంకరించి, పూజించి భోనంలను సమర్పించితే కరువూ కాటకాలు ఉండవని, సంవృద్ధిగా వానలు కురిపించి పాడి పంటలను ప్రసాదిస్తుందని ప్రజల నమ్మకం.

నేటి నుంచి ఉత్సవాలు...

మహంకాళి ఆలయంలో 7వ వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం ప్రారంభమవుతాయి. పట్టణంలోని రెడ్డి సంఘాలు, మున్నూరు కాపు సంఘంతో పాటు ఇతర భక్తులు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 15న ఉదయం 8 గంటలకు అమ్మకు మహాభిషేకం శాకములతో అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణ, ఉదయం 9 గంటల నుంచి సామూహిక కుంకుమార్చన, అమ్మవారి మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలుంటాయి. మాధవానంద సరస్వతీ స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారు. కాగా, ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

వంట గదులు.. పిల్లల ఆరోగ్య కేంద్రాలు

అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్



దుద్దెడ అంగన్‌వాడీలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న గరీమా

కొండపాక(గజ్వేల్): వంట గదులు పిల్లల ఆరోగ్య రక్ష కేంద్రాలని అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల్లో పోషకాహార లోపాలు తలెత్తకుండా ఉండేందుకు తల్లులకు అవగాహన కల్పించారు. పిల్లల్లో చిన్న వయసు నుంచే సరైన ఎదుగుదల ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పౌష్టికాహార లోపం ఏర్పడకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం ప్యాకెట్లను అందజేస్తోందన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహాదేవ్‌గౌడ్, డీపీఓ దేవకీదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ వీరరాజు, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్‌కు ప్రాధాన్యం

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: పట్టణంలో శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించి ఆటంకం లేకుండా చర్యలు తీసుకునేలా కార్మికులను అప్రమత్తం చేస్తామని మున్సిపల్ కమిషనర్‌గా టి.మల్లికార్జున్ అన్నారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆస్థానంలో పనిచేసిన కమిషనర్ రాజశేఖర్ సెక్రటేరియట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ మురుగు కాలువలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయిస్తామన్నారు. సాయంత్రం వేళల్లో ఫాగింగ్ ద్వారా దోమల నివారణ చర్యలు చేపడుతామన్నారు. పట్టణంలో పందుల బెడద లేకుండా చేస్తామన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీటిని అందిస్తామన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది రాకుండా ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.

కోమటి చెరువు బాగుంది..

సిద్దిపేటజోన్: సిద్దిపేట కోమటి చెరువును హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ జాన్‌మనోజ్ బుధవారం సందర్శించారు. చాలా బాగుందని కితాబిచ్చారు. తెలంగాణకు తలమానికంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ మంత్రి హరీశ్ రావుకు దక్కుతుందన్నారు. ఆయన వెంట ఇండియన్ మహిళా క్రికెటర్ మిథాలిరాజ్, కోచ్ మూర్తి, క్రికెట్ కొచ్ దయానంద్ ఉన్నారు.

ఎంపీడీఓల బాధ్యతలు స్వీకరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల ఎంపీడీఓగా భానోతు జయరాం బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఆస్థానంలో పనిచేసిన సత్యపాల్‌రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నుంచి ఎంపీడీఓ జయరాం ఇక్కడికి వచ్చారు. అనంతరం ఎంపీపీ మాలోతు లక్ష్మీ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు.

దౌల్తాబాద్(దుబ్బాక): ఎంపీడీఓగా వెంకట లక్ష్మమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. ఇక్కడ పని చేసిన రాజేష్‌కుమార్ సంగారెడ్డి జిల్లా అందోల్‌కు బదిలీపై వెళ్లారు.

హుస్నాబాద్: ఎంపీడీఓగా పి. వేణుగోపాల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లా చీల్పూరు నుంచి బదిలీ పై వచ్చారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరికీ అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఉద్యోగులు శాలువతో ఆయన్ను సన్మానించారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఎంపీడీఓగా బండి లక్ష్మప్ప బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఆస్థానంలో పని చేసిన దమ్మని రాము కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. వికారాబాద్ జిల్లా నుంచి లక్ష్మప్ప ఇక్కడికి వచ్చారు.

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల నూతన ఎంపీడీఓగా శ్రీరాములు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆస్థానంలో విధులు నిర్వహించిన మురళీధర్‌శర్మ అదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. రాములుకు కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు స్వాగతం పలికారు.

మున్సిపల్ కమిషనర్‌గా రమేష్ నియామకం

చేర్యాల(సిద్దిపేట): మున్సిపల్ కమిషనర్‌గా టి.రమేష్ నియమితులయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో పనిచేసిన జి.రాజేంద్రకుమార్ బదిలీ అయ్యారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



సిద్దిపేట: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తదితరులు



గజ్వేల్ రూరల్: పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద అవగాహన కల్పిస్తున్న సీఐ సైదా

సిద్దిపేటకమాన్/ దుబ్బాక/ కొమురవెల్లి/ తొగుట/ గజ్వేల్‌రూరల్/ మద్దూరు/ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పోలీసులు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం జిల్లావ్యా ప్తంగా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు, వాహన దారులకు అవగాహన కల్పించారు. ముందుగా ఆయా చోట్ల హెల్మెట్లు ధరించి ర్యాలీలు నిర్వహించారు. సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల అక్షరాభ్యాసం



గజ్వేల్: నాణెంలతో సరస్వతీ మాత రూపాన్ని చిత్రించిన రామకోటి రామరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): వసంత పంచమిని పురస్కరించుకుని చిన్నకోడూరు మండలం అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఇక్కడ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలల యాజమాన్యాలు తమ పిల్లలను ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రం వార్షికోత్సవాల్లో భాగంగా పూజలు నిర్వహించారు. అమ్మకు విశేష పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు.

గజ్వేల్ రూరల్‌లో..

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా పాఠశాలలో వసంత పంచమిని నిర్వహించారు. పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ రమేష్ పాల్గొని మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు పిల్లలపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో ఉపాధ్యాయినులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు రూ. 16వేల విలువైన నాణెంలతో 10 అడుగుల సరస్వతీ మాత రూపాన్ని చిత్రించి పూజలు నిర్వహించారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలో గల విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా సాగాయి. నీల సరస్వతీ మాతగా విజయదుర్గ అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు క్షేత్రం నిర్వాహకులు హరినాథ శర్మ గణపతి పూజతో ప్రారంభించి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

ప్రజలు అప్రమత్తం

చేర్యాల(సిద్దిపేట): ప్రజలు దొంగతనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వాటి నివారణకు సహకరించాలని సీఐ ఎల్.శ్రీను అన్నారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎస్ఐ ఓ.దామోదర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల మండల పరిధిలోని తాడూరు, కొమురవెల్లి మండల పరిధిలోని గౌరాయపల్లి, మద్దూరు మండల కేంద్రంలో జరిగిన చోరీలన్నీ తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయన్నారు. ఎవరో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై తిరుగుతూ రోజువారీగా తాళాలు వేసి ఉంటున్న గృహాలను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో ఇరుగు పొరుగు వారికి తెలియజేయాలని, లేదా పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిస్తే రక్షణ కల్పిస్తామన్నారు. విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు ఇళ్లలో భద్రపరుచుకోవద్దని, బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవాలన్నారు. చోరీలు జరిగిన గ్రామాల్లో క్లూస్ టీం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని త్వరలోనే వారిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాపార, వాణిజ్య స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన.....

రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పట్టణ కేంద్రంలోని అంగడిబజారు వద్ద సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ దామోదర్ ట్రాఫిక్ నిబంధనలపై వాహనాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు పూవులు ఇచ్చి ట్రాఫిక్ నిబంధనలు తెలియజేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భారతి సిమెంట్ ఆధ్వర్యంలో వాటర్ బాటిల్స్ పంపిణీ



వాటర్ బాటిళ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ సంస్థ ప్రతినిధులు

వర్గల్(గజ్వేల్): వసంత పంచమి సందర్భంగా వర్గల్ క్షేత్రంలో బుధవారం వికాట్ గ్రూప్‌నకు చెందిన భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు భక్తులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని, నిర్మాణం దృఢత్వం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ టీ. సతీష్‌కుమార్, టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ కే.సునీల్, ఆఫీసర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **గాయపడ్డ నెమలిని రక్షించిన గ్రామస్తులు**

చిన్నకోడూరు(సిద్దిపేట): గాయపడ్డ నెమలిని గ్రామస్తులు పట్టుకుని ఫారెస్టు అధికారులకు అప్పగించారు. మండల పరిధిలోని గోనెపల్లి గ్రామ శివారు పొలాల వద్ద బుధవారం ఇది కనిపించింది. గమనించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుమన అక్కడకు చేరుకుని నెమలిని తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తం వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆక్సిజన్ పార్క్‌లో వదిలినట్లు చెప్పారు. దానిని రక్షించిన గ్రామస్తులను అభినందించారు.

◆ **అవకతవకలతో సంబంధం లేదు**

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఇటీవల వసతి గదుల కేటాయింపుల్లో జరిగిన డబ్బుల అవకతవకలలో తమకు సంబంధం లేదని సిబ్బంది గజ్జె గణేష్, సనాది నరేష్ బుధవారం చైర్మన్ లక్ష్మారెడ్డి ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామే ఆలయంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేస్తామని కానీ డబ్బులతో సంబంధం లేదన్నారు. భక్తులు వసతి కోసం అడ్వాన్సుగా చెల్లిస్తారని, ఇవి ఖాళీ చేసేటప్పుడు తిరిగిస్తారన్నారు. ఒక వేళ వారి సమయం మించి పోతే తిరిగి చెల్లించడం ఉండదని, రశీదు రాయని విషయం నిజమేనన్నారు. ఆ డబ్బులు గదుల విచారణలో పని చేసే ఆలయ ఉద్యోగులే తీసుకుంటారన్నారు.

◆ **సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీపీ**

గజ్వేల్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ దాసరి అమరావతి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లో గల ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆపై ఎంపీటీసీలు, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు నిర్వహించే సమావేశానికి అధికారులు పూర్తి స్థాయిలో రాకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు చొరవ చూపాలన్నారు. ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

◆ **పేకాట స్థావరంపై దాడి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ముత్తన్నపేట శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేశారు. నలుగురికి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,600లతోపాటు 4 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

◆ **కొమురవెల్లి ఆలయ అభివృద్ధికి కృషి**

కొమురవెల్లి(సిద్దిపేట) : కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధికి పాలక మండలి కృషి చేస్తోందని ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమ దర్శనాలను కట్టడి చేశామన్నారు. స్వామి వారి బుకింగ్ ఆదాయాన్ని పెంచామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు కావాల్సిన సౌకర్యాలు తాగునీరు, టాయిలెట్లను ఏర్పాటు చేశామన్నారు. పాత కామన్ వద్ద భక్తులకు సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. భక్తుల వసతి కోసం 120 గదుల నిర్మాణం చేపడతామన్నారు. కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మేడికుంట శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **డీఎల్‌పీఓగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ**



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజనల్ పంచాయతీ అధికారిగా వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లా నర్సంపేట నుంచి బదిలీ పై ఇక్కడికి వచ్చారు. హుస్నాబాద్ డీఎల్‌పీఓ వీరభద్రయ్య భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు.